# భూగోళ నివాసయోగ్యతను కాపాడలేమా?!

ప్రపంచ దేశాలు శిలాజ ఇంధనాల (ఫాజిల్ ఫ్యూయల్స్) వాడకం అనబడే వ్యసనానికి అనాలోచితంగా బానిసలు అవుతున్నాయి. తాత్కాలిక, స్వల్పకాలిక ప్రయోజనాలకు ఆశ పడి దీర్ఘకాలిక సంక్షోభాగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ధరిత్రితో పాటు మానవ సమాజ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి కోల్, కోల్ ఉత్పత్తులు, సహజ వాయువు, ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, వంట చెరుకు లాంటి శిలాజ ఇంధనాలను వినియోగించడం సర్వ సాధారణం అయ్యింది. తక్షణమే ప్రపంచ దేశాలు శిలాజ ఇంధనాల వినియోగానికి క్రమ క్రమంగా స్వస్తి పలికి సౌర, పవన, సముద్ర అలల, బయోమాస్, జియోథర్మల్, హైడ్రోజన్, హైడ్రోపవర్ లాంటి పునరుత్పాదక ఇంధనాలను ఆశ్రయించని యెడల సుస్థిర శక్తి భద్రత, శక్తి వినియోగ ధరలు, సర్వతోముఖాభివృద్ధి, ధరణి ఆరోగ్య పరిరక్షణలకు విఘాతం కలుగుతుందని తెలుసుకోవాలి. శిలాజ ఇంధనాల వినియోగం మూలంగా వాతావరణ ప్రతికూల మార్పులతో భూగోళం నిప్పుల కుంపటి మారనుంది, మారుతున్నది. సాంప్రదాయ తరిగే శిలాజ ఇంధనాల వాడకాన్ని విశ్వవ్యాప్తంగా తగ్గిస్తూ తరగని సాంప్రదాయేతర పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాల్సిన అగత్యం ఏర్పడింది. పునరుత్పాదక ఇంధనాలే ప్రపంచానికి 21వ శతాబ్దపు ఆరోగ్య భాగ్యాలను ప్రసాదించే వరాలని భావించాలి. సరసమైన ధరలకు పునరుత్పాదక శక్తిని అందించే సుస్థిర స్థితికి చేరినపుడు మాత్రమే భూగోళం జీవుల నివాసయోగ్యతకు అర్హతను కలిగి ఉంటుంది. శిలాజ ఇంధన రూపంలో పొంచి ఉన్న భూతాప ప్రమాదాలను మరిచిన ప్రపంచ దేశాలు నేటికీ వాటి వాడకం మీదనే అతిగా ఆధారపడి ఉండడం సోచనీయం, ఆక్షేపణీయం.

## శిలాజ ఇంధనాల దుష్ప్రభావం:

రోమ్ తగలపడుతున్న వేళ నీరో ఫిడేలు వాయించినట్లు భూవాతావరణం వేడెక్కుతున్న వేళ పలు దేశాధినేతలు అనాలోచితంగా శిలాజ ఇంధనాల వినియోగానికి ఉవ్విలూరుతున్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధంతో వాతావరణ మార్పులు తీవ్ర సమస్యగా మారుతున్నది. ప్రపంచ దేశాలు శిలాజ ఇంధనాల సరఫరాలో ప్రతి నిమిషం 11 బిలియన్ల అమెరికన్ డాలర్ల సబ్సిడీలను భరిస్తున్నాయి. శిలాజ ఇంధన వినియోగం ఇలాగే కొనసాగితే అకాల వర్షాలు, వరదలు, కరువుకాటకాలు, కార్చిచ్చులు, అసాధారణ అనారోగ్య కారణ ఉష్ణోగ్రతలు లాంటి ప్రకృతి విపత్తులు సాధారణం కానున్నాయి. దీనికి తోడుగా జీవవైవిధ్య సమస్యతో జీవకోటి మనుగడ ప్రశ్నార్థకం కానున్నది. నేడు భూగోళం వాతావరణ ప్రతికూల మార్పుల కల్లోలం ఉంది. శిలాజ ఇంధనాలతో వాతావరణ మార్పుల సంక్షోభం అంచున ప్రపంచ ప్రాణికోటి నిలబడి ఉంది. ఈ ప్రతికూల మార్పులకు అతీతులెవరూ లేరు. అన్ని జీవరాశులతో పాటు ప్రపంచ మానవ సమాజం ఈ భూగోళ మంటల్ని భరించాల్సిందే, తగు శాప ఫలాలను అనుభవించాల్సిందే.

## ప్రస్తుత కర్తవ్యం ఏమిటి?!

ప్రపంచ దేశాలు 2030 నాటికి క్రమంగా శిలాజ ఇంధనాల వినియోగాలను, వాటికి సంబంధించిన మౌళిక వసతులను తగ్గిస్తూనే పునరుత్పాదక తరగని ఇంధనాల వినియోగాలను, పెట్టుబడులను, ఉత్పత్తులను పెంచాల్సిన అనివార్యత ఏర్పడింది. జీ-20 దేశాల ప్రభుత్వాలతో పాటు ఓఈసిడి దేశాలు ఈ దిశగా వడివడిగా అడుగులు వేయాల్సి ఉంది. పునరుత్పాదక ఇంధనాలకు సంబంధించిన సాంకేతికతలను, టెక్నాలజీ మార్పుల ప్రతిబంధకాలైన మేధో హక్కులను సడలించడం సత్వరమే జరగాలి. తరగని సాంప్రదాయేతర ఇంధన టెక్నాలజీ ఉపకరణాలను, ముడి సరుకుల సరఫరా శృంఖలాలను ప్రపంచ దేశాల మధ్య నెలకొల్పాల్సి ఉంటుంది. 2020 నాటికే అందుబాటులోకి వచ్చిన 5 గీగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాలను 2030 నాటికి అనేక గీగావాట్ల నిలువ సామర్థ్యాలకు పెంచాల్సి ఉంది. శిలాజ ఇంధనాలకు వెచ్చించే నిధులను తరగని ఇంధనాల అభివృద్ధికి, ఉత్పత్తికి వినియోగించుకోవలసి ఉంటుంది. సౌర, పవన శక్తి ఉత్పత్తికి సంబంధించిన ప్రభుత్వ అనుమతులు వేగంగా, సులభంగా అందుబాటులోకి రావాలి. పునరుత్పాదక శక్తి ఉత్పత్తులను కనీసం 3 రెట్లు పెంచడానికి ప్రణాళికలు అమలు చేయాలి. సాంప్రదాయేతర ఇంధనాల ఉత్పత్తి పరిశ్రమలు నెలకొల్పడానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు వితరణ చేసేలా యాంత్రాంగాలను సమాయత్తం చేయాలి.

## భూగ్రహం నివాసయోగ్యతను కాపాడలేమా?!

వాతావరణ ప్రతికూల మార్పులతో ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు పెరిగితే భూగోళం నివాసయోగ్యతలను కోల్పోతుందని మరువరాదు. 2030 నాటికి 40 శాతం కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు 2050 నాటికి జీరో కార్బన్ ఉద్గార స్థాయికి చేరుకునేలా స్థిరమైన అడుగులు పడాలి. పునరుత్పాదక శక్తి విప్లవం మానవాళి మనుగడకు గొడుగులు పట్టనున్నది. నేడు ఉక్రెయిన్ యుద్ధంతో చమురు, సహజ వాయువు ధరలు చుక్కలను అందుకుంటున్న వేళ పునరుత్పాదక శక్తి ధరలు తగ్గనున్నాయి. పునరుత్పాదక శక్తి ఉత్పత్తి పరిశ్రమలు లక్షల ఉద్యోగాలను ఇవ్వనున్నాయి. అడవుల నరుకువేత, భూసారం తగ్గడం లాంటి ప్రధాన అంశాలు కూడా భూతాపానికి దోహదపడుతున్నాయని మనకు తెలుసు. చేతులు కాలక ముందే ఆకులు సిద్ధం చేసుకుంటూ, దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుంటూ భూమాతను ఓ అద్భుత నివాసయోగ్య ఆలయంగా మార్చుకుందాం. శిలాజ ఇంధనాలకు చరమగీతం పాడుదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# గుజరాత్‌లోని ద్వారక, గోప్‌నాథ్ మరియు వెరావల్‌లోని చారిత్రక లైట్‌హౌస్‌ల వద్ద అద్భుతమైన పర్యాటక సౌకర్యాలు

న్యూఢిల్లీ, జులై 1:భారతదేశ విశిష్టమైన లైట్‌హౌస్‌లను ఆకట్టుకునే వారసత్వ పర్యాటక ప్రదేశాలుగా మార్చేందుకు గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి దూరదృష్టితో కూడిన దృక్పథానికి అనుగుణంగా, ద్వారక, గోపనాథ్ మరియు వెరావల్ నగరాలలో జులై 1, 2023న గుజరాత్‌లోని ద్వారకలో పర్యాటక సౌకర్యాలను ప్రారంభించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులను ఆకర్షిస్తూ, ఈ అద్భుతమైన నిర్మాణాలు ఘన సంస్కృతి, ప్రాముఖ్యత మరియు ఆకర్షణను ప్రదర్శించడం ఈ చొరవ లక్ష్యం.

'మన్ కీ బాత్' యొక్క 75వ ఎపిసోడ్ సందర్భంగా, గౌరవ ప్రధాన మంత్రి లైట్‌హౌస్‌ల ప్రత్యేక ఆకర్షణలు పర్యాటక ఆకర్షణలుగా కాగల వాటి సామర్థ్యాన్ని నొక్కి చెప్పారు. "పర్యాటకానికి సంబంధించినంత వరకు లైట్ హౌస్‌లు ప్రత్యేకమైనవి. వాటి భారీ పరిమాణం కారణంగా, లైట్ హౌస్‌లు ఎల్లప్పుడూ పర్యాటకులను ఆకర్షిస్తాయి. పర్యాటకాన్ని పెంచడం కోసం డి జీ ఎల్ ఎల్ భారతదేశంలో మరో 72 లైట్‌హౌస్‌లను కూడా గుర్తించింది.

ప్రధానమంత్రి దార్శనికత నుండి ప్రేరణ పొందిన ఈ మహత్తర సందర్భం నగరం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం మరియు ప్రచారం చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది తద్వారా సందర్శకులకు మునుపెన్నడూ లేని విధంగా అసాధారణ అనుభవాన్ని అందిస్తుంది. తరతరాలుగా నావికులకు సేవలందించిన ఈ లైట్‌హౌస్‌లు ప్రముఖ మైలురాళ్లు ఇప్పుడు ఈ లైట్‌హౌస్‌ల వద్ద ప్రపంచ స్థాయి పర్యాటక సౌకర్యాలు కూడా అభివృద్ధి చేయబడ్డాయి. కొత్తగా ప్రారంభించబడిన సౌకర్యాలు ఆధునిక సౌకర్యాలతో చారిత్రక శోభను మిళితం చేస్తాయి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులకు సాటిలేని గమ్యస్థానాన్ని సృష్టిస్తాయి.

ప్రారంభోత్సవానికి కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ ఉ జలమార్గాలు మరియు ఆయుష్ శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ అధ్యక్షత వహిస్తారు, గౌరవ ప్రముఖులు మరియు విశిష్ట అతిథి శ్రీ రాఘవభాయ్ హన్స్‌రాజ్‌భాయ్ పటేల్, వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ మంత్రి, ప్రభుత్వం, గుజరాత్, శ్రీమతి. పూనంబెన్ మాడమ్, ఎంపీ (ఎల్ఎస్), జామ్‌నగర్, శ్రీ రాజేష్‌భాయ్ చుడాసమా, ఎంపీ (ఎల్ఎస్), జునాఘర్, శ్రీ గౌతంభాయ్ చౌహాన్, ఎమ్మెల్యే, తలజా, శ్రీ పబూభా మానెక్, ఎమ్మెల్యే, ద్వారకా, శ్రీ విమలభాయ్ చూడాసమా, ఎమ్మెల్యే, సోమనాథ్ మరియు శ్రీ టి కె రామచంద్రన్, కార్యదర్శి , ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

పర్యాటక సౌకర్యాన్ని సందర్శించే సందర్శకులు ఇంటరాక్టివ్ ప్రదర్శనలు, ఆకర్షణీయమైన దృశ్య శ్రవణ ప్రదర్శనలు మరియు గైడెడ్ టూర్‌ల ద్వారా లైట్‌హౌస్ యొక్క గొప్ప చరిత్రను అన్వేషించడానికి అవకాశం ఉంటుంది. ఈ సదుపాయం ఒక విశాలమైన వీక్షణ డెక్‌ను కలిగి ఉంటుంది, ఇది చుట్టుపక్కల ప్రకృతి సౌందర్యం మరియు నగరం యొక్క తీరప్రాంత దృశ్యాల ఉత్కంఠభరితమైన వీక్షణలను అందిస్తుంది.

ఈ పర్యాటక సదుపాయం యొక్క ప్రారంభోత్సవం ప్రభుత్వాల మధ్య సహకార స్ఫూర్తి ని సూచిస్తుంది . మన విశిష్ట వారసత్వాన్ని ప్రదర్శించే శక్తివంతమైన మరియు అభివృద్ధి చెందుతున్న పర్యాటక గమ్యాన్ని సృష్టించే మన సమిష్టి స్ఫూర్తి కి, దృష్టికి నిదర్శనం.

# గురుకులాల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, జులై 1: ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో చిన్నాభిన్నమైన విద్యారంగాన్ని సీఎం కేసీఆర్(అట ఐఅఖీ) విప్లవాత్మకమైన నిర్ణయంతో బలోపేతం చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కందుకూరు మండలం నేదునూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల , ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో అమెజాన్ సంస్థ వారి సహకారంతో ఆధునిక వసతులతో తీర్చిదిద్దిన పాఠశాలను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గురుకులాల ద్వారా నిరుపేద విద్యార్థులకు(ఖనీనీతీ ాబిబీటవనిబిబ) నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 298 గురుకులాలు ఉండగా, వాటి సంఖ్య 1030కి పెంచారని తెలిపారు. మన ఊరు, మన బడి స్ఫూర్తితో పాఠశాల అభివృద్ధికి అమెజాన్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.

12 రకాల సౌకర్యాలతో రాష్ట్ర వ్యాప్తంగా తీర్చిదిద్దిన వెయ్యి పాఠశాలల లాగే నేదునూరు పాఠశాలకు సకల హంగులు వచ్చాయని పేర్కొన్నారు. ఆడపిల్లలు చదువులను మధ్యలోనే నిలిపివేయవద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెండు జతల బట్టలు,పుస్తకాలు,రాగి జావ, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు ఇస్తున్నట్లు వివరించారు. రంగారెడ్డి జిల్లాపరిషత్ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి పాండు, మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ కాసుల రామక్రిష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు బుగ్గన భూమి పూజ..



అమరావతి, జులై 1: డోన్ పట్టణంలో రూ.12 కోట్లతో నిర్మించనున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ భూమి పూజ నిర్వహించారు.. అలాగే . డోన్ లో రూ.5.5 కోట్లతో నిర్మించిన కొత్త పురపాలక పరిపాలన భవనాన్ని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తో కలసి బుగ్గన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ పి.కోటేశ్వరరావు, నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్, ఆర్డీవో వెంకట రెడ్డి, ఎమ్మార్వో విద్యాసాగర్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైలు ఢీకొని వ్యక్తి మృతి.. జహీరాబాద్‌లో ఘటన

మెదక్, జులై 1:నేటినిజం (ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ కేంద్రంలో ఘోరం జరిగింది. రైల్వే స్టేషన్ పక్కన అండర్ బ్రిడ్జ్ సమీపంలో రైలు ఢీకొని ఒకరు చనిపోయారు. ఈ ఘటనలో చనిపోయిన వారిని ఆర్య నగర్‌కు చెందిన సగ్గం తుకారాం (55) గా గుర్తించారు. బస్తీ వాసులు తెలిపిన సమాచారం ప్రకారం.. తుకారాం అవివాహితుడు. ఆయనకు కాస్త మతిస్థిమితం లేకుండేదని తెలిపారు. తుకారం పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందా? ఆయనే రైలుకు ఎదురుగా వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం తెలియాల్సి ఉంది. రైల్వే స్టేషన్ సిబ్బంది వికారాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేయాల్సి ఉంది.

# ఆయుష్మాన్ భారత్ ఇప్పటివరకు ప్రపంచంలోనే అత్యుత్తమ ఆరోగ్య బీమా పథకమని తెలిపిన కేంద్ర మంత్రి డా. జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 1:కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ ఉ టెక్నాలజీ; ఎంఓఎస్ పిఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు రోజు ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఆరోగ్య బీమా పథకం అని మరియు దానిని రూపొందించిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి చెందుతుందని స్పష్టం చేశారు.

ఇప్పటికే ఉన్న వ్యాధికి కూడా బీమా రక్షణను పొందే అవకాశాన్ని అందించే ప్రపంచంలోని ఏకైక ఆరోగ్య బీమా పథకం బహుశా ఇదేనని కేంద్రమంత్రి తెలిపారు. ఉదాహరణకు ఈ రోజు ఒక వ్యక్తికి క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించినట్లయితే అతను వెళ్లి చికిత్స కోసం బీమా ఆర్థిక సహాయం పొందవచ్చని చెప్పారు.

ఈరోజు ఇక్కడ డాక్టర్స్ డే సందర్భంగా ఎకనామిక్ టైమ్స్ డాక్టర్స్ డే కాన్క్లేవ్‌లో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్‌ను తీసుకురావడం ద్వారా భారతదేశం ఆరోగ్య సేవలను అందించడంలో రంగాల మరియు విభజన విధానం నుండి సమగ్ర అవసరాల ఆధారిత ఆరోగ్య సంరక్షణ సేవకు మారిందని అన్నారు. ఇది విశిష్టమైన పథకం అని, ముందుగా ఉన్న వ్యాధులకు కూడా నమోదు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఆర్థిక ప్రమాణాలతో సంబంధం లేకుండా ఆరోగ్య పథకం యొక్క సార్వత్రిక కవరేజీని కలిగి ఉన్న మొదటి యూటీ జమ్మూ మరియు కాశ్మీర్ అని ఆయన తెలియజేశారు.

ఆయుష్మాన్ భారత్ యోజన ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఉత్తమమైన ఆసుపత్రుల్లో ఐదు లక్షల రూపాయల వరకు ఉచిత చికిత్స అందిస్తున్నట్లు మంత్రి తెలియజేశారు. పథకం అమలులో కొన్ని అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ, అమలులో ప్రాథమిక దశలో ఉన్నామని, తగిన సమయంలో పథకంలో అవసరమైన మార్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భారతదేశం వంటి విస్తారమైన భిన్నమైన దేశంలో సమగ్రత అనేది ఒక పెద్ద అంశం అని ఖచ్చితంగా ఈ ఆరోగ్య బీమా పథకం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి ఉద్ఘాటించారు.

కొవిడ్ మహమ్మారి సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ యొక్క సద్గుణాలను మనకు నేర్పిందని, మహమ్మారి దాటిన తర్వాత కూడా తగిన చికిత్స మరియు వివిధ వ్యాధుల నివారణకు సమగ్ర ఔషధ విధానాన్ని సంస్థాగతీకరించడం మానవజాతికి ప్రయోజనకరంగా ఉంటుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. కొవిడ్ సమయంలో పాశ్చాత్య దేశాలు కూడా ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, యోగా, నేచురోపతి మరియు ఇతర ఓరియంటల్ ప్రత్యామ్నాయాల నుండి తీసుకోబడిన రోగనిరోధక శక్తిని పెంపొందించే పద్ధతుల కోసం భారతదేశం వైపు చూడటం ప్రారంభించాయని మంత్రి చెప్పారు. అయితే, కోవిడ్ దశ ముగిసిన తర్వాత కూడా, వైద్య నిర్వహణలోని వివిధ వ్యాధులు మరియు రుగ్మతల చికిత్సకు ఇవి విజయవంతంగా అనుసరిస్తున్నారని చెప్పారు.

కొవిడ్-19 మనల్ని తాకినప్పుడు మార్చి 2020లో టెలిమెడిసిన్ ప్రాక్టీస్ మార్గదర్శకాలను భారతదేశం తెలియజేసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. ఏప్రిల్ 2020లో ఆయుష్ కోసం తాము అదే చేశామన్నారు. తమ గ్రౌండ్‌వర్క్ పూర్తి అయినందున భారతదేశం ఈ మార్గదర్శకాలను వెంటనే తెలియజేయగలదని ఆయన అన్నారు. "అందరికీ ఆరోగ్యం" సాధించడానికి ముందస్తు షరతు అయిన "అందరికీ డిజిటల్ ఆరోగ్యం" అందేలా మనం కలిసికట్టుగా కృషి చేయాలని మంత్రి అన్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే కోవిడ్-19 ప్రపంచాన్ని తాకకముందే 'డిజిటల్ ఇండియా' యొక్క శక్తివంతమైన దృక్పథాన్ని పంచుకోవడం ప్రధాని మోదీ దూరదృష్టి అని అన్నారు.

2015లో ఎర్రకోట ప్రాకారాల నుండి స్టార్టప్ ఇండియా మరియు స్టాండప్ ఇండియా కోసం మళ్లీ ప్రధాని మోదీ పిలుపునిచ్చారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. భారతదేశంలో అప్పుడు కేవలం 350 స్టార్టప్‌లు మాత్రమే పనిచేస్తున్నాయి. కానీ ఇప్పుడు ప్రపంచంలోని స్టార్టప్స్‌లో భారతదేశం 3వ స్థానంలో ఉంది. దేశంలో దాదాపు లక్ష స్టార్టప్‌లు మరియు 100 ప్లస్ యునికార్న్‌లు ఉన్నాయి. అంతేకాకుండా వాటిలో చాలా హీత్ మరియు బయోటెక్ స్టార్టప్‌లు ఉన్నాయి.

# ఈటలకు వై-ప్లస్ కేటగిరీ భద్రత..

## -తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )./ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి తన హత్యకు కుట్ర చేస్తున్నారని ఈటల రాజేందర్ ఆయన సతీమణి జమున ఆరోపణలు చేసిన నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వై-ప్లస్ భద్రత కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి నుంచి ఈటలకు వై-ప్లస్ కేటగిరీ భద్రత ఉంటుంది.ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ముప్పు ఉన్నట్లు తెలంగాణ ప్రభుత్వం నిర్ధారించిన విషయం తెలిసిందే. హుజురాబాద్‌తో పాటు జిల్లాల పర్యటనల్లో అనుమానాస్పద కార్లు తిరుగుతున్నాయని ఈటల వెల్లడించారు. ఈటల మీడియాకు వెల్లడించిన వెంటనే మంత్రి కేటీఆర్ స్పందించారు. స్వయంగా చొరవ తీసుకొని డీజీపీకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈటలను కలిసి వివరాలను సేకరించినట్లు మేడ్చల్ డీసీపీ సందీప్ రావు తెలిపారు. ఈటెల భద్రతపై సీల్డ్ కవర్లో డీజీపీకి రిపోర్ట్ అందజేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం వై ప్లస్ భద్రత కల్పించింది.

# టీటీడీ ఆధ్వర్యంలో ఆపరేటివ్ ఆర్థో ప్లాస్టీ సమ్మిట్.. 200 మంది ఆర్థో డాక్టర్ల లైవ్ సర్జరీ ప్రోగ్రాం

తిరుపతి, జులై 1: టీటీడీ కి చెందిన బాలాజీ దివ్యాంగుల శస్త్ర చికిత్స, పరిశోధనా కేంద్రం (బర్డ్ ) ఆధ్వర్యంలో జూన్ 30వ తేదీ నుండి జూలై 2వ తేదీ వరకు " ఆపరేటివ్ ఆర్థో ప్లాస్టీ సమ్మిట్ " పేరుతో లైవ్ సర్జరీలు నిర్వహించే కార్యక్రమం జరగనున్నాయి.

బర్డ్ ఆసుపత్రిలో గత నాలుగేళ్ళుగా రోగులకు అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్యం అందించడానికి కోట్ల రూపాయల ఖర్చుతో ఆధునిక స్కానర్లు, ఎక్స్ రే మిషన్లు, సి టి స్కానర్లు లాంటి అనేక యంత్రాలను ఏర్పాటు చేశారు.

బర్డ్ ఆసుపత్రికి వచ్చే రోగులకే కాకుండా బయటి ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్న రోగులకు కూడా తక్కువ ఖర్చుకే సిటి, ఎక్స్ రే, రక్త పరీక్షలు చేసే సదుపాయం అందుబాటులోకి తెచ్చింది.

ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నే లా వసతులు కల్పించి పేదలకు ఉచితంగా సర్జరీలు చేస్తూనే, సొమ్ము చెల్లించి సర్జరీ చేయించుకునే శక్తి ఉన్న వారికి తక్కువ ధరకే మోకీలు మార్పిడి, ఇతర ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఆన్లైన్, ఫోన్ ఎస్ ఎం ఎస్ ద్వారా కూడా ఓపి సేవలు పొందే సదుపాయం ఏర్పాట్లున్నాయి.

అటువంటి బర్డ్ ఆసుపత్రిలో జరుగుతున్న అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్లను ఆసుపత్రి వైద్యులతో పాటు దేశంలోని ఆర్థో వైద్యులు చూసి అవగాహన పెంచుకోవడానికి టి టి డి ప్రత్యేకంగా ఆర్థో ప్లాస్టి సమ్మిట్ నిర్వహించ తలపెట్టింది .

మూడు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్ లో దేశంలోని టాప్ 20 ఆర్థో వైద్య నిపుణులు లైవ్ లో సర్జరీలు చేస్తారు.

ఇప్పటిదాకా నమోదు చేసుకున్న సుమారు 200 మంది వైద్యులు బర్డ్ ఆసుపత్రి లోని ఆధునిక ఆపరేషన్ థియేటర్లో జరిగే సర్జరీలను ఫార్చ్యూన్ గ్రాండ్ రిడ్జ్ హోటల్ లో వీక్షిస్తారు. సర్జరీకి సంబంధించి తమకు తెలియని విషయాలను సర్జరీ చేస్తున్న ప్రముఖ వైద్యులను అడిగి తెలుసుకోవచ్చు. బర్డ్ చరిత్రలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వైద్యుల నుండి వచ్చిన స్పందన దృష్ట్యా స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కూడా కల్పించాలని బర్డ్ ట్రస్ట్ నిర్ణయించింది. డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దీపక్ పర్యవేక్షణలో సమ్మిట్ ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయని బర్డ్ డైరెక్టర్ డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. ఫార్చ్యూన్ గ్రాండ్ రిడ్జ్ హోటల్ లో జూన్ 30 వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి సమ్మిట్ ను ప్రారంభించనున్నారు.



# సురక్షా క్యాంపెయిన్‌లో ధ్రువపత్రాలను జారీ చేయాలి- కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం, జులై 1 : జగనన్న సురక్షా కార్యక్రమంలో సేవల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంట వెంటనే ధ్రువ పత్రాలను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కాంపెయిన్ రోజున, లేదా ఇంకా ముందే వారి దరఖాస్తులను పరిష్కరించాలని, క్యాంపు తర్వాత ఏది కూడా పెండింగ్ ఉండకూడదన్నారు.

శనివారం కలెక్టర్ నగరంలోని 1,2,3,4 సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపెయిన్ లకు హాజరయ్యారు. క్యాంపెయిన్ ఎలా నిర్వహిస్తున్నది, ఎన్నెన్ని టోకెన్లు జారీ అయినది వాలంటీర్లను, సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు.

మహిళలతో మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్ లో ఏయే సేవలు పొందుతున్నారు, వాలంటీర్లు ఇంటికి వచ్చారా అని ప్రశ్నించారు. మహిళలంతా వారు పొందుతున్న సేవల గురించి కలెక్టర్ కు వివరించారు.

ఇదివరకు ఆలస్యంగా అందేవని, ఈ క్యాంప్ ద్వారా వెంటనే ధ్రువ పత్రాలు అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఎండ ఎక్కువగా ఉన్నందున త్వరగా వారి పనులను పూర్తి చేసి పంపేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ? ఈ క్యాంప్ ద్వారా ఇంతవరకూ 52వేల సేవలకు ఆన్లైన్ లో దరఖాస్తులు నమోదయ్యాయని తెలిపారు. ఎక్కువగా క్యాస్ట్, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆధార్ అప్డేషన్ కోసం దరఖాస్తులు వస్తున్నాయని, 11 రకాల సేవలను వేగంగా అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, కమిషనర్ శ్రీరాములు నాయుడు, కార్పొరేటర్లు ఆనంద్, అల్లు చాణుక్య, రాజేష్, సత్యగౌరి, ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పలు ధ్రువ పత్రాలను అందజేశారు.

# ఆంధ్రప్రదేశ్‌లో జనసేన-వైసీపీ నేతల మధ్య వ్యక్తిగత జీవితాలపై రచ్చ రచ్చ

అమరావతి జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) ఆంధ్రప్రదేశ్‌లో జనసేన–వైసీపీ నేతల మధ్య వ్యక్తిగత జీవితాలపై రచ్చ రచ్చ అవుతోంది..!. అధికార పార్టీ నేతలను ఒకటంటే ప్రతిపక్షాలు అంతకుమించి అనడం.. దానికి కౌంటర్లు రావడం గతం వారం, పదిరోజులుగా పరిపాటిగానే వస్తోంది. ఇటీవల బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ రెడ్డి ల జనసేన అధినేత పవన్ కల్యాణ్ మూడు పెళ్లిళ్లతో పాటు వ్యక్తిగత జీవితంపై మాట్లాడారు. అది కూడా విద్యార్థులున్న సభలో మాట్లాడటంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. తన పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడటంతో పవన్‌కు చిర్రెత్తుకొచ్చింది. శుక్రవారం నాడు భీమవరంలో జరిగిన వారాహీ యాత్ర వేదికగా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చేశారు. అంతేకాదు.. జగన్ వ్యక్తిగత జీవితం గురించి, హైదరాబాద్ వేదికగా ఏమేం చేశారనే విషయాలను ప్రస్తావించి మరీ మాట్లాడారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..!

సీఎం జగన్ చెవులు రిక్కించు విను.. నీ వ్యక్తిగత జీవితం క్షణక్షణం నాకు తెలుసు. నా వ్యక్తిగత జీవితాల గురించి పనికిమాలిన మాటలు మాట్లాడితే చూస్తూ ఉండను. హైదరాబాద్‌లో జగన్ ఏమేం చేశాడో.. చాలా లోతైన విషయాలు నాకు తెలుసు. అవన్నీ నేను మాట్లాడలేక కాదు.. మళ్లీ చెబుతున్నా నీ (వైఎస్ జగన్) పర్సనల్ లైఫ్ గురించి నాకు అంతా తెలుసు. నీ మనిషిని పంపించు.. నేను చెప్పే విషయాలు వింటే చెవులు నుంచి రక్తం వస్తుంది. ఇది వార్నింగ్ అనుకో. బలమైన పోరాటం ఇవ్వబోతున్నాను. ఇక్కడ ఉన్న నాయకులు సైలెన్సర్లతో ఇంటి చుట్టూ తిరుగుతున్నారని కొందరు బాధపడుతున్నారు. మీ నోటికి సైలెన్సర్లు బిగిస్తాను. నాకు యువత అంటే ఇష్టం.. మిమ్మల్ని కులాల వారీగా విడదీయడం నాకు ఇష్టం లేదు. ఆడవారి మాన ప్రాణాలకు అండగా ఉంటాను. కుల వైషమ్యాలను వదిలేద్దాం.. చిన్న చిన్న గొడవలను పెద్దగా చెయ్యవద్దు' అని భీమవరం సభా వేదికగా పవన్ వ్యాఖ్యానించారు.

నా గురించి మాట్లాడారో..?

'పాతిక సంవత్సరాలు మీకు కూలీగా పనిచేయడానికి వచ్చాను. వచ్చే ఎన్నికల్లో గెలివిస్తారని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను. బీసీలకు సంపూర్ణ రాజ్యాధికారం కావాలి. దళితులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి. మనస్పూర్తిగా చెబుతున్నాను.. నాకు హీరోలంటే చాలా ఇష్టం. జగన్.. ఫ్యాక్షన్ బ్యాగ్రౌండ్, రౌడీయిజం బ్యాగ్రౌండ్ ఉందని ఎగురుతున్నావేమో.. వాటిని ఎలా ఎదుర్కోవాలో నాకు బాగా తెలుసు. 151 మంది ఎమ్మెల్యేలుగా నా గురించి గానీ, పార్టీ గురించి మాట్లాడితే ఊరుకోను. మీ నోటికి సైలెన్సర్లు బిగించుకుంటే మంచిది. గాంధీజీ ఎక్స్ పీరియన్స్ విత్ ట్రూత్ అనే పుస్తకం రాస్తే.. జగన్ మాత్రం ఎక్స్ పీరియన్స్ విత్ లైస్, ఎక్స్ పీరియన్స్ విత్ ఎక్స్ టార్షన్ అనే పుస్తకాలు రాశారు. చిన్నప్పుడే జగన్ పోలీసులను కొట్టాడు. అటువంటి వ్యక్తి ఎంపీ రఘురామను పోలీసులతో కొట్టించడంలో పెద్ద విశేషమేముంది. అయన ఇప్పుడు పోలీసులతో పరిపాలన చేస్తున్నారు. గొడ్డలి రాష్ట్ర ఆయుధంగా చేశారు. వైసీపీకి సవాల్ చేస్తున్నా.. మీరు గెలుస్తారా..? మేము గెలుస్తామో..? చూద్దాం. నిండా మునిగిన నాకు చలేంటి..?. తుందుర్రు అక్వా పోరాటంలో కొందరిపై కేసులు పెట్టారు. అధికారంలోకి వస్తే వాటిని ఎత్తివేస్తాం. ఆ కేసులు ఇప్పటికీ ఎత్తేయ్యలేదు .. మేము అధికారంలోకి వస్తే ఆ కేసులు ఎత్తివేస్తాం' అని భీమవరం ప్రజలకు పవన్ హామీ ఇచ్చారు. పవన్ వర్సెస్ జగన్ మధ్య వ్యక్తిగత జీవితాలపై రోజురోజుకూ విమర్శలు, ప్రతి విమర్శలు.. కౌంటర్లు పెరుగుతూనే వస్తున్నాయ్. ఇప్పుడు సేనాని కామెంట్స్‌కు వైసీపీ నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుందో వేచి చూడాల్సిందే మరి.

# హోదాకి వెలుగులు .. విభజన హామీలు నెరవేర్చే దిశగా కేంద్రం అడుగులు ..



అమరావతి, జులై 1:రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలన జరుపుతోంది. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఇప్పటి వరకు ప్రత్యేక హోదా సాధ్యంకాదని కేంద్ర పెద్దలు తేల్చిచెప్పిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీని అమలు చేయాల్సిందిగా ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి కేంద్రానికి విన్నవిస్తున్నారు.. విభజన హామీలను కూడా నెరవేర్చాలని ఒత్తిడి తెస్తున్నారు. విభజన సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన ప్రయో జనాలపై కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నారు. ప్రత్యేక హోదాతో పాటు కడప లో స్టీల్ ప్లాంట్, గిరిజన, పెట్రోలియం విశ్వవిద్యాలయాలకు అనుమతులు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ పునరుద్ధరణ అన్నింటికీ మించి పోలవరం అంచనాల సవరణలపై గత రెండేళ్లుగా ఢిల్లిట పెద్దలతో మంతనా లు సాగిస్తున్నారు. విభజనానంతరం ఏపీ రెవెన్యూలోటును భర్తీ చేస్తామని ప్రకటించిన కేంద్రం ఇటీవలే 10వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో పాటు గత ఆరు నెలలుగా ఆర్థికంగా రాష్ట్రం పుంజుకునేందుకు అవసరమైన రుణ పరపతికి కేంద్రం సుముఖత వ్యక్తం చేస్తోంది. వి భజన హామీలు నెరవేర్చక పోగా విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకర ణకు కేంద్రం నిర్ణయం తీసుకోవటంతో రాష్ట్రంలో వ్యతిరేకత వ్యక్తమైంది. దక్షిణాది రాష్ట్రాల్లో పట్టు సాధించాలనే వ్యూహంతో పావులు కదుపుతున్న కేంద్రంలోని బీజేపీకి ఇటీవల కర్నాటక ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. మరోవంక తెలంగాణ, తమిళనాడు, కేరళలో బీజేపీయేతర ప్రాంతీయ పార్టీల ముఖ్యమంత్రులు ధిక్కార స్వరాలు వినిపిస్తున్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే (రాజకీయంగా మినహా) అంశాల వారీ మద్దతు ఇస్తుండటంతో విభజన హామీల అమలుపై కేంద్రం ఫోకస్ పెంచినట్లు తెలుస్తోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని సీఎం జగన్ ఢిల్లిట వెళ్లిన ప్రతి సందర్భంలో ప్రధానికి, అమిత్‌షాకు అందించే వినతిపత్రాల్లో ప్రధానంగా విజ్ఞప్తి చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈసారి విభజన హామీలపై కీలక ప్రకటన చేసేలా కేంద్రంపై సీఎం జగన్ ఒత్తిడి తేనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇందులో భాగంగా ఈనెల 5, 6 తేదీల్లో ఢిల్లిటకి బయల్దేరి వెళ్లనున్నారు. గత వారమే పర్యటనకు సిద్ధమైనప్పటికీ ప్రధాని మోడీ, అమిత్ షాల అపాయింట్‌మెంట్లు ఆలస్యం కావటంతో వాయిదా పడింది.

ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కుగనుల శాఖ మంత్రితో పాటు జలవనరుల మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తదితరులను కలిసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ముందుగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 6,7,8 తేదీల్లో రాయలసీమ జిల్లాల్లో పర్యటనతో పాటు 8న ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు, ఆపై అనంతపురంలో రైతు బీమా కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉంది. ఢిల్లిట పర్యటన సందర్భంగా రైతు బీమా కార్యక్రమాన్ని 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను కేంద్రంలోని బీజేపీ నిశితంగా పరిశీలిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలతో పాటు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లులకు వైఎస్సార్ కాంగ్రెస్ మద్దతిస్తూ వచ్చింది. అయితే ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల వ్యూహాన్ని అనుసరించే క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కొద్దిరోజుల క్రితం ఢిల్లిటలో ప్రధాని మోడీ, అమిత్‌షాలతో భేటీ అయిన సంగతి తెలిసిందే. దీంతో బీజేపీ, వైసీపీల మధ్య దూరం పెరిగిందని అం తా భావించారు. అయితే ఢిల్లిటలో పరిణామాలు మరోరకంగా ఉన్నాయి.

బీజేపీ హైకమాండ్, వైసీపీ, జగన్ సర్కార్ మధ్య లోపాయకారీ మంతనాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. రాజకీయంగా అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఇటీవల రాష్ట్రానికి వచ్చి చేసిన విమర్శలు అనంతరం జరిగిన పరిణామాలే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. విభజన అనంతరం గత ప్రభుత్వ హయాం నుంచి రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయినందున ఆర్థిక వెసులుబాటుతో పాటు ఎఫ్ఆర్‌బీఎం రుణపరపతి శాతాన్ని, రాష్ట్రం నుంచి వచ్చే పన్నుల్లో వాటాను పెంచాలని ముఖ్యమంత్రి జగన్ గత కొంతకాలంగా కేంద్రాన్ని కోరుతున్నా రు. తెలంగాణ నుంచి బదలాయించాల్సిన ఆస్తులు, టీఎస్ జెన్‌కో ఏపీకి చెల్లించాల్సిన బకాయిలపై కూడా కేంద్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. దక్షిణాదిలో ఏపీ నుంచి మాత్రమే కేంద్రానికి మద్దతు వస్తున్నందున రాష్ట్రా నికి సంబంధించిన అన్ని విభజన హామీలను నెరవేర్చాలని తాజాగా కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం.

# వైద్యులు దైవసమానులు.. వైద్యో నారాయనో హరి..



జడ్చర్ల జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నపురస్కరించుకొని జడ్చర్ల పట్టణంలోని విజయ క్లినిక్ లో సీనియర్ ఎంబీబీఎస్ డాక్టర్ రామిరెడ్డిని సన్మానించి బీసీ సేన నాయకులు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లింగంపేట శేఖర్, నిరంజన్, గోపాల్ మాచారం శ్రీనివాస్, సురభి విజయ్ కుమార్ , ఆకుల చంద్రమౌళిలు మాట్లాడుతూ వైద్యులు దైవసమానులని, దైవానికి నిలువెత్తు నిదర్శనం డాక్టర్ రామ్ రెడ్డి అని ఆయన సేవలను కొనియాడారుగత 50 సంవత్సరాలుగా, విద్య రంగంలో నిరంతరం సేవలందిస్తూనే ఉన్నారని ప్రభుత్వ వైద్యులు గా రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా నిరుపేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తూ, నిరుపేదలకు ఉచితంగా మందులు కూడా అందిస్తున్నారు. నేటి యువ డాక్టర్లందరూ డాక్టర్ రామ్ రెడ్డి గారిని ఆదర్శంగా తీసుకొని వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యరంగం తో పాటు రాజకీయ రంగం, లైన్స్ క్లబ్ ద్వారా కూడా ప్రజలకు సేవలు అందించిన గొప్ప సేవ నిరతుడని ఆయన సేవలను కొనియాడా, ఈ కార్యక్రమంలో బీసీసేన మండల అధ్యక్షులు బొల్లె మోని నిరంజన్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి లింగంపేట్ శేఖర్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, జిల్లా నాయకులు గోపాల్,మాచారం శ్రీనివాస్, కార్మిక విభాగం మండల అధ్యక్షులుఆకుల చంద్రమౌళి,మండల కార్యదర్శి సురభి రఘు, శివ రాములు, సురభి ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు

సామాజిక మాధ్యమాల్లో

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేసిన వ్యక్తి అరెస్ట్

## -సిరిసిల్ల డిఎస్పీ విశ్వప్రసాద్

రాజన్న సిరిసిల్ల, జులై 1:(నేటినిజం ప్రతినిధి): గంభీరావుపేట్ మండలంలోని మహిళలను అవమానించే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇరు వర్గాల మధ్య గొడవలు సృష్టించే విధంగా క్రియేట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన గంభీరావుపేట్ గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాన్ అనే వ్యక్తి మీద గంభీరావుపేట్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, మొబైల్ ఫోన్ సీజ్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని సిరిసిల్ల డిఎస్పీ విశ్వ ప్రసాద్ అన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కానీ పోస్ట్ కానీ చేయడం జరిగేనట్లతే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇతరుల మనోభావాలను రెచ్చగొట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టు లు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధముగ వీడియోలు కానీ ఫోటిస్ కానీ మెసేజ్ లు కానీ వాట్సప్ గ్రూప్ ల్లో పోస్ట్ చేసిన వ్యక్తుల మీద గ్రూప్ అడ్మిన్ ల మీద కఠిన చర్యలు తీసుకోవడం జరిగుతుందని అన్నారు.

# పాథాలజీ పరీక్షల అప్ గ్రేడేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి హరీష్ రావు



సంగారెడ్డి, జులై 1: సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్స్ 134 రకాల పాథాలజీ పరీక్షల అప్ గ్రేడేషన్ ను వర్చువల్ గా రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర హ్యాండ్లూం కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ పాల్గొని ప్రభుత్వ ఆసుపత్రిలో పాథాలజీ పరీక్షల అప్ గ్రేడేషన్ పరికరాలను ప్రారంభించారు. పాథాలజీ పరీక్షల అప్ గ్రేడేషన్ రూపొందించిన పట్టికను ఆవిష్కరించారు. రోగులకు పరీక్షలు నిర్వహించిన పరీక్ష ఫలితాల నివేదిక అందజేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ? స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో ఉన్న వైద్య సదుపాయాలు ఎక్కడా లేవన్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ దేశానికే ఆదర్శం, హైదరాబాద్ ఆస్పత్రిలో అందే సేవలు మారుమూల ప్రాంత ఆసుపత్రిలో అందించాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు.

134 పరీక్షలు ప్రారంభించడం ద్వారా పేదలకు ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకం పెరుగుతుందన్నారు. ఖర్చులకు భయపడి పరీక్షలు వాయిదా వేసుకుంటే ప్రాణాలకే ప్రమాదమని, పైసా ఖర్చు లేకుండా మారుమూల ప్రాంతాల ప్రజలకు 134 పరీక్షల సదుపాయం, దేశంలో ఎక్కడ లేని విధంగా 134 రకాల పాథాలజీ పరీక్షలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వాణి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ అనిల్, మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభూ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజుల స్కీం పునరుద్ధరించాలి

## -ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి
## -కార్పొరేట్ కాలేజీలను నిషేధించాలి
## -తెలుగు సంక్షేమ భవన్ ముట్టడించిన బీసీ విద్యార్థులు



హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల రియంబర్స్ మెంట్ స్కీమును పునరుద్ధించాలని, గత రెండు సంవత్సరాల ఫీజుల బకాయిల 5 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ లు, ఢీఆ, ఓఖీఆ, ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిలో భాగంగా వందలాది మంది విద్యార్థులు నేడు తెలుగు సంక్షేమ భవన్ ముట్టడించారు. ఈ ముట్టడికి రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ నాయకత్వం వహించారు.

రాజ్యసభ సభ్యులు, జాతీయ బి.సి సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, బి.సి నాయకులు ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, సుధాకర్, ఃఅ వెంకట్, భాస్కర్ ప్రజాపతి, మల్లేష్, సాయి గౌడ్, అనిల్, చంద్ర శేఖర్, రమ ముదిరాజు, వంశీ, ప్రజిత్ పాల్గొని ప్రసంగిచారు. ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ ఇంజనీరింగ్/ఎంబీఏ/ఎంసిఏ/పీజీ/డిగ్రీ/ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బి.సి. విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. గత 2 సంవత్సరాల ఫీజుల బకాయిలు 5 వేల కోట్లు వెంటనే చెల్లించాలి. అలాగే ఐఐటీ – ఐఐఎం – ఎన్.ఐ.టి తదితర కోర్సులకు కూడా పూర్తి ఫీజులు చెల్లించాలి. కాలేజి విద్యార్థులకు సంవత్సరంకు ఆంధ్ర ప్రదేశ్ లో ఇస్తున్న మాదిరిగా 20 వేల స్కాలర్ షిప్ ను మన రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి మంజూరు చేయాలన్నారు. ముట్టడిని ఉద్దేశించి వేముల రామకృష్ణ ప్రసంగిస్తూ శ్రీ చైతన్య, నారాయణ కాలేజీలు ఎక్కువ ఫీజులులాగుతు రాష్ట్ర ప్రజలను దోచుకుంటున్నారు. బట్టీ చదువులు, బలవంతపు చదువులతో విద్యార్థులను వేధిస్తున్నారు. అందుకే రోజుకొక్కరు చనిపోతున్నారు. రాష్ట్రంలోని 60 శాతం విద్యార్థులు ఈ కాలేజీలలో చదువుచున్నారు. ఈ కాలేజీల వల్ల విద్యావ్యవస్థ భ్రష్టు పడుతుంది. వీటిని వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను పీల్చి పిప్పి చేస్తూ ఆత్మహత్యలకు దోహదం చేస్తున్న కార్పొరేట్ కాలేజీలను నిషేధించాలని కోరారు.

# తనను ఒంటరి వాడిని చేసి చుట్టుముట్టి ఎన్నో కుట్రలు చేస్తున్నారు

## -టీడీపీ నేత కోడెల శివరాం

పల్నాడు జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో ఇంటింటికి కోడెల, పల్లె నిద్ర కార్యక్రమాన్ని టీడీపీ నేత కోడెల శివరాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పల్నాడు గడ్డ మీద పసుపు జెండా చూడగానే గుర్తొచ్చే నాయకుడు కోడెల శివప్రసాదరావు అన్నారు. తనను ఒంటరి వాడిని చేసి చుట్టుముట్టి ఎన్నో కుట్రలు చేస్తున్నారు.

పదవుల కోసం అధికారం కోసం పార్టీలు మారే కుటుంబం తమది కాదన్నారు. కోడెల శివప్రసాదరావు స్థానంలో వేరే వారిని తీసుకొచ్చారని వాపోయారు. అలా తీసుకొచ్చిన వారి వెంట తనను నడవమన్నారని.. కానీ తాను నడవనని కోడెల శివరాం తెలిపారు. పల్నాటి పులి కోడెలతో నడచిన తాను పిల్లల పక్కన నడిచేది లేదని స్పష్టం చేశారు.

ఇటీవల సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణను నియమించి ఈ సారి అసెంబ్లీ టికెట్‌ను ఆయనకే కేటాయిస్తున్నట్టు పార్టీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. అప్పటి వరకూ పార్టీ టికెట్‌ను ఆశిస్తున్న కోడెల శివరాం ఒక్కసారిగా అవాక్కయ్యారు. నిజానికి కోడెల శివప్రసాదరావు మరణించినప్పటి నుంచి నియోజకవర్గ బాధ్యతలను కోడెల శివరాం తీసుకున్నారు. ఈ క్రమంలోనే సత్తెనపల్లి టికెట్ తనదేనన్న భావనతో ఆయన ఉన్నారు. కానీ చంద్రబాబు నిర్ణయంతో ఆయన సందిగ్ధంలో పడ్డారు. అప్పటి నుంచి సందర్భం దొరికినప్పుడల్లా ఆయన తాను కన్నాతో కలిసి నడిచేది లేదని చెబుతూనే వస్తున్నారు. నేడు కూడా మరోసారి అదే విషయాన్ని కోడెల శివరాం స్పష్టం చేశారు.

# వానలు కురవాలని గ్రామదేవతలకు పూజలు

ఆదిలాబాద్, జులై 1:వర్షాకాలం మొదలై సుమారుగా నెల రోజులు గడుస్తున్నా సరైన వర్షపాతం లేక రైతులు అయోమయంలో పడ్డారు. రాష్ట్రానికి ఋతుపవనాలు విచ్చేశాయని.. ఎలాగో వర్షాలు పడకపోతాయా అని రైతులు పత్తి విత్తనాలు విత్తుకున్నరు. విత్తనాలు విత్తుకున్నారు సరే.. వర్షాలు మాత్రం కురవడం లేదు. దీంతో రైతులు చేతులు నెత్తిన పెట్టుకొని ఆకాశం వైపు ఆశతో చూస్తున్నారు.

పత్తి విత్తనాలు ఎక్కడ భూమి పాలు అవుతాయోనని రైతులు ఆవేదన చెందుతున్నరు.

వర్షాలు కురవాలని ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. అందులో భాగంగానే మండలంలోని కరంజీ టీ గ్రామంలో గ్రామ దేవతలకు డప్పు చప్పులతో పెద్ద ఎత్తున మహిళలు తల బింద చేతబట్టి గ్రామ దేవతలకు నీలాభిషేకం చేసి? సకాలంలో వర్షాలు కురవాలని తమ పాడి పంట చక్కగా ఉండి గ్రామాలు పచ్చగా ఉండాలని కోరుకున్నారు.


తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం
ఉమ్మడి కరీంనగర్ జిల్లా

ఆహ్వానము

ప్రముఖ కవి, రచయిత, కాలమిస్ట్
డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన
మధుపాళీ... మధు క(వితా)వనం కవితా సంపుటి
గ్రంథ ఆవిష్కరణ సభ

తేది : 04-07-2023 మంగళవారం సా॥ గం॥6.15 ని॥లకు వేదిక : ఫిలిం భవన్, కరీంనగర్

ముఖ్య అతిథి & మధు క(వితా)వనం ఆవిష్కర్త :
శ్రీ దేశపతి శ్రీనివాస్ గారు, ఎమ్మెల్సీ

విశిష్ట అతిథి :
శ్రీ జి.వి.శ్యాంప్రసాద్ లాల్ గారు, అదనపు జిల్లా కలెక్టర్, కరీంనగర్

సభాధ్యక్షులు :
శ్రీ దాస్యం సేనాధిపతి గారు, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు

గౌరవ అతిథులు :
డా॥ గండ్ర లక్ష్మణ్ రావు గారు, ప్రముఖ సాహితీవేత్త
శ్రీ వారాల ఆనంద్ గారు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

పుస్తక పరిచయం :
శ్రీ ఏ. గజేందర్ రెడ్డి గారు, అధ్యక్షులు, సమతా సాహితి

ఆత్మీయ అతిథులు :
శ్రీ బి.వి.ఆర్. గోపాల్ రెడ్డి గారు, ఛైర్మన్, నిగమ గ్రూప్ ఆఫ్ కాలేజెస్
శ్రీ నంది శ్రీనివాస్ గారు, అధ్యక్షులు, సాహితీ గౌతమి
శ్రీ గాజుల రవీందర్ గారు, అధ్యక్షులు, జాతీయ సాహిత్య పరిషత్
శ్రీ కొత్త అనిల్ కుమార్ గారు, అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
శ్రీ కె.ఎస్. అనంతాచార్య గారు, ప్రధాన కార్యదర్శి, సమైక్య సాహితి
శ్రీ వైరాగ్యం ప్రభాకర్ గారు, అధ్యక్షులు, ఉదయ సాహితి

ఆహ్వానించువారు : బొమ్మకంటి కిషన్, కార్యదర్శి    అనుముల దయాకర్, కోశాధికారి

# విశ్వబ్రాహ్మణ సత్రం శ్రీశైలంలో 50 సెంటు స్థలము మంజూరు పట్ల హర్షం




శ్రీశైలం జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికారి ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జి ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ శ్రీశైల మహా క్షేత్రంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకుని స్వామివారి ఆశీర్వాదం పొందారు.

తదనంతరం శ్రీ విశ్వబ్రాహ్మణ అన్నదాన క్షేత్రం కోశాధికారి పాలేపు నాగభూషణాచారి గారితో సత్రం నిర్వహణ కరోనా సమయంలో సౌకర్యాల్లోనూ క్వాలిటీ విషయంలోనూ నాణ్యమైన సేవలు అందిస్తున్నారని ఈ సందర్భంగా ఈ ఆరు సంవత్సరాల్లో 18 నెలల కరోనా కలుపుకొని 92 లక్షల రూపాయలు మిగులు బడ్జెట్ ని బ్యాంకులో డిపాజిట్ చేయడం జరిగిందని శ్రీశైల మహా క్షేత్రంలో గత పది సంవత్సరాలుగా నూతనంగా శ్రీ విశ్వబ్రాహ్మణ సత్రం నిర్మాణానికి 50 సెంట్లు స్థలం ప్రభుత్వం ద్వారా కోరుతున్నామని ఇప్పటి ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు 50 సెంట్లు స్థలం మంజూరు చేశారని త్వరలో 100 రూములు నూతన భోజనశాల సమావేశ మందిరం డార్మెటరీ లాకర్ సదుపాయం వృద్ధాశ్రమం వేద పాఠశాల వంటి దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్టు సత్రం కోశాధికారి పాలెపు నాగభూషణాచారి గారు తెలిపారు ఈ సందర్భంగా అన్నదాన సత్రంలో ప్రసాదాన్ని ఆరగించి కమిటీ వారికి క్వాలిటీ పట్ల అభినందనలు తెలియజేశారు అలాగే నూతనంగా నిర్మించే సత్రంలో విశ్వబ్రాహ్మణ ఎన్నారై సేవలు వారి పెద్దల పేర్లతో వివిధ నిర్మాణాలు చేపట్టాలని కర్రి వేణుమాధవ్ సూచించారు ఈ సందర్భంగా సెంట్రల్ గవర్నమెంట్ ఏజీ ఆఫీస్ ఆడిట్ ఆఫీసర్ హనీష్ చంద్ర పితాని గారు అకౌంట్ బుక్స్ పరిశీలించారుఈ సందర్భంగా మేనేజర్ బ్రహ్మ సిద్ధార్థ గారు స్వామివారి ప్రసాదాలు అందజేశారు

# బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేత.. ఉరకలెత్తుతున్న గోదావరి

నిర్మల్ , జులై 1: నిర్మల్ జిల్లా బాసర గోదావరి నదికి ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఇవాళ ఉదయం 14గేట్లను తెరిచారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నీటి పారుదల శాఖల అధికారుల సమక్షంలో అధికారులు గేట్లను ఎత్తేసారు. ప్రస్తుతం మహారాష్ట్ర నుండి బాసర వైపు గోదావరి నది పరవళ్లు తొక్కుతూ ఉరకలు వేస్తుంది. ఇక గేట్లను ఎత్తేయడంతో నది పరివాహక ప్రాంత రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# న్యాయవాద వృత్తి ఉన్నతమైనది- జిల్లా జడ్జి సునీత కుంచాల




నిజామాబాద్, జులై 1:భారత న్యాయవ్యవస్థలో మేధో సంపత్తి కలిగిన న్యాయవాదులకు కొదువలేదని, న్యాయవాద వృత్తి ఉన్నతమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. న్యాయవ్యవస్థ తో పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎందరో మహానుభావులు దేశ ప్రగతి నిర్మాణానికి పునాదులు వేసిన న్యాయవాదులున్నారని తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్ లో న్యాయవాద వృత్తి, వృత్తి పరమైన నీతి అనే అంశంపై నిర్వహించిన సెమినార్ లో ఆమె న్యాయవాదులను ఉద్దేశించి ప్రసంగించారు. చట్టాలను నిరంతర అధ్యయనం చేయాలని నూతన చట్టాలను తెలుసుకోవాలని ఆమె అన్నారు.

జూనియర్ న్యాయవాదులు తమ సీనియర్ న్యాయవాదుల వద్ద ఎన్నో చట్ట సంబంధిత విషయ పరిజ్ఞానం నేర్చుకోవాలని సూచించారు. న్యాయ స్థానాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వృత్తిపరమైన అవకాశాలున్నాయన్నారు. ఆంగ్లంలో అనర్గళమైన పరిజ్ఞానం, బాషపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. వృత్తిలోని గొప్పతనాన్ని కాపాడుకోవాలని ఉద్బోధించారు. న్యాయవాద వృత్తి నుండి దేశ ప్రధాన మంత్రులు, మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు అయిన చరిత్ర ఉన్నదని తెలిపారు. స్వతంత్ర న్యాయ వ్యవస్థలోని ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తులు దేశానికి వెలుగురేకులుగా నిలుస్తూ ప్రజాస్వామ్య సౌధానికి ఒక ప్రధాన రక్షకులుగా నిలుస్తున్న వర్తమాన చరిత్ర మనముందు ఉన్నదని వివరించారు. బార్ అధ్యక్షుడు దేవదాస్, ప్రధాన కార్యదర్శి భాగి చరణ్ ప్రసంగిస్తూ ముఖ్యంగా జూనియర్ ఎం న్యాయవాదులకు న్యాయ సంబంధిత విషయ పరిజ్ఞానాన్ని విస్తృతం చేయాలనే సంకల్పంతో సెమినార్ కు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

# ప్రజారోగ్యమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం.. ఎమ్మెల్యేలు



మహబూబ్‌నగర్, జులై 1: గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 70 లక్షల వ్యయంతో నిర్మాణమైన రేడియాలజీ హబ్ ను స్థానిక శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అలంపూర్ శాసనసభ్యులు డాక్టర్ వి.యం.అబ్రహం ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యేల చేతుల మీదుగా రేడియాలజీ ల్యాబ్ ను, 134 రకాల పరీక్షలు హబ్ ను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగినది. ముందుగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, డాక్టర్ వి.యం.అబ్రహం, ప్రజా ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారి, వైద్యులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రితో మాట్లాడుతూ.. జాతీయ వైద్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి గద్వాలకు సిటీ స్కానింగ్ అవసరం, మెడికల్ కాలేజీ గురించి మంత్రితో ఎమ్మెల్యేలు మాట్లాడడం జరిగింది. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే సిటీ స్కానింగ్ ఏర్పాటు చేస్తామని, అదేవిధంగా మెడికల్ కాలేజ్ సంబంధించిన జీవోను కూడా వారం 15 రోజుల్లో శాంక్షన్ చేస్తామని తెలిపారు.

గద్వాలలో కొనసాగుతున్న 300 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను, నర్సింగ్ కాలేజ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. జాతీయ వైద్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో వైద్య రంగానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో సరైన వైద్య సదుపాయాలు లేక ఈ ప్రాంతం నుండి ప్రజలు కర్నూలు, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వైద్య సదుపాయాల కోసం వెళ్లేవారని, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనేవారన్నారు. ప్రధానమైన ఆరోగ్య సమస్యలు, రోడ్డు ప్రమాదాలు జరిగినా సరైన వైద్యం అందనప్పుడు కర్నూలు వంటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు దారిలోనే కొంతమంది ప్రాణాలను కోల్పోవడం జరిగేదని, ఇలాంటి ఎన్నో సంఘటనలు గతంలో జరిగాయని పేర్కొన్నారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వాసుపత్రిలో పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన రోగాలకు చికిత్స పొందే విధంగా వైద్యులతో వైద్యం అందించే గద్వాల జిల్లా ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోసిక్ ద్వారా ఉచితంగా 57 రకాల పరీక్షలను నిర్వహించేవారు. కానీ వాటిని పెంచి నేటి నుంచి 134 రకాల పరీక్షలకు చేసే విధంగా ఇప్పటి వరకు టి- దయాగ్నోసిక్ 10 కోట్లకు పైగా ఉచిత టెస్టులను 57.68 లక్షలు మందికి రోగాలకు ప్రయోజనం చేశారన్నారు.

నేడు రాష్ట్రంలో గద్వాల జిల్లాలలో నూతన రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్ ను ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుందన్నారు. గద్వాలకు త్వరలోనే సిటీ స్కానర్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరడం జరిగిందని, మంత్రి కూడా సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. అదేవిధంగా మెడికల్ కాలేజీకి సంబంధించిన జీవో ని కూడా ఇస్తామని తెలిపారు. కరోనా కష్ట సమయంలో కూడా తమ ప్రాణాలను సైతం లెక్క చేయక ఎంతోమంది కరోనా బాధితులకు సేవలందించిన ప్రతి ఒక్క వైద్యులకు వైద్య సిబ్బందికి పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి.యస్ కేశవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ, జడ్పీ వైస్ చైర్మన్ సరోజమ్మ, అన్ని మండలాల ఎంపీపీలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బిసి విద్యార్థులు 5000 కోట్ల ఫీజు రీయంబుస్మెంట్ చెలించాలి

## -శెరిలింగంపల్లి ఎంఆర్ఓ ఆఫీస్ ముట్టడి

హైదరాబాద్, జులై 1బిసి విద్యార్థులు 5000 కోట్ల ఫీజు రీయంబుస్మెంట్ చెలించాలని డిమాండ్ చేస్తూ

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు

రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు ఎంఆర్ఓ ఆఫీస్ ల ముట్టడి లో బాగంగా శెరిలింగంపల్లి

ఎంఆర్ఓ ఆఫీస్ ను ముట్టడించారు. అనంతరం ఎంఆర్ఓ కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం శెరిలింగంపల్లి బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడునర్సింగ్ ముధిరాజ్ మాట్లాడుతూ 5000 కోట్ల ఫీజు రీయంబుస్మెంట్ బాకైలు చెలించాలని ,కాలేజీ హాస్టళ్లకు ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించాలని, కార్పొరేట్ కాలేజీలను నిషేదించాలని, బీసీ సంక్షేమ శాఖలో అవినీతి అరికట్టాలని,

రాష్ట్ర వాయపటంగా బీసీ కుల అందరికి 100000 రూపాయలు అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పాలుగొన్న పెద్దలు బండారు రమేష్ యాదవ్, ఆర్.కరణ్ గౌడ్, నాగేష్ ముదిరాజ్, మల్లేష్ గౌడ్, లక్ష్మణ్, సరోజినమ్మ, వెంకట లక్ష్మి, శివ, తాడితర్లు పాల్గొన్నారు

# విద్యార్థులకు గుడ్ న్యూస్- హైదరాబాద్ మెట్రోలో స్టూడెంట్ పాస్

హైదరాబాద్, జులై 1:హైదరాబాద్ మెట్రో రైల్ విద్యార్థులకు శుభవార్త చెప్పింది. మెట్రో రైళ్లలో స్టూడెంట్ పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపింది. విద్యార్థులు 20 ట్రిప్పులకు డబ్బులు చెల్లించి 30 ట్రిపుల్లో ప్రయాణించవచ్చని పేర్కొంది. 2024 మార్చి 31 వరకు విద్యార్థులకు పాస్ సదుపాయం వుంటుందని తెలిపింది. ఏప్రిల్ 1, 1998 తర్వాత జన్మించిన విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పింది. ఇవాళ్టి నుంచే స్టూడెంట్ పాస్ అందుబాటులో వుంటుందని మెట్రో అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

# టిఎస్ పి ఎస్ సికు సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కృతజ్ఞతలు

హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గ్రూప్-4 పరీక్షకు హాజరయిన మహిళా అభ్యర్థులను పరీక్ష కేంద్రం లోకి అనుమతించే క్రమంలో హిందూ మహిళల మంగళ సూత్రం, గాజులు, మెట్టెలు కుంకుమ వంటి ఆబరణాలను తీసివేయాలనే నిబంధనలను ఎత్తి వేసినందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ జనార్దన్ రెడ్డికి సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ మేరకు సమితి ప్రతినిధులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్-4 పరీక్షకు లక్షలాది మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారని, గతంలో జరిగిన గ్రూప్ పరీక్షలలో పరీక్ష కేంద్రం వద్ద మంగళసూత్రంతో పాటు, ఇతర ఆభరణాలు తీసివేయించేవారని వారు గుర్తు చేశారు. ముందు జాగ్రత్తగా మంగళసూత్రంతో పాటు, ఇతర ఆభరణాలు తొలగించవద్దని టిఎస్ పి ఎస్ సికి మేము విజ్ఞప్తి చేయటం జరిగిందని అందుకు వారు తక్షణమే స్పందించడం పట్ల వారు హర్షం వెలిబుచ్చారు. తమ విన్నపాన్ని మన్నించి మహిళలను ఆభరణాలతో పరీక్ష కేంద్రంలోకి అనుమతించి హిందువుల మనోభావాలను గౌరవించినందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ జనార్దన్ రెడ్డికి హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి చైర్మన్ పుట్టి యాదగిరి ముదిరాజ్, ప్రెసిడెంట్ ఠాకూర్ యమున్ ధన్యవాదములు తెలిపారు. భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని పుట్టి యాదగిరి ముదిరాజ్, యమన్ సింగ్ సూచించారు.

# పేదలు, రైతులు రెండు కండ్లుగా కేసీఆర్ పాలన.. మంత్రి వేముల



నిజామాబాద్, జులై 1: పేదలు, రైతులు రెండు కండ్లుగా కేసీఆర్ పాలన సాగుతోందని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ కు చెందిన నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు తీగల సంతోష్ అతని అనుచరులు హైదరాబాద్ లో శనివారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దయతో అన్నివిధాలా అభివృద్ధి చేసుకున్నామని మంత్రి అన్నారు. సాగునీటి రంగంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన వైద్య సేవలు, బి.టి రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు, సంక్షేమ పథకాలతో బాల్కొండ నియోజకవర్గం సుభిక్షమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఈ సందర్బంగా చెప్పారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ప్రపంచ స్థాయి ప్రశంసలు అందుతున్నాయని, అన్ని రంగాల్లో తెలంగాణ నెంబర్ వన్ గా ఎదిగిందన్నారు. రోజు రోజుకు దేశ వ్యాప్తంగా తెలంగాణ మోడల్ అభివృద్ధి కావాలనే డిమాండ్ పెరుగుతోందన్నారు.

అబ్ కి బార్ కిసాన్ సర్కార్ అంటూ దేశ మార్పు కోసం బయలుదేరిన కేసీఆర్ కు ప్రజల్లోంచి విశేష మద్దతు లభిస్తోందని తెలిపారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ వల్ల 10 ఏళ్లుగా పాలిస్తున్న బీజేపీ వల్ల పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పచ్చగున్న తెలంగాణ మీద బీజేపీ విషం చిమ్ముతుందని, కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఎవరెన్ని సర్కస్ ఫీట్లు వేసినీ.. బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ గెలుపు ఖాయమని తేల్చి చెప్పారు. ఏది ఏమైనా కేసీఆర్ నాయకత్వమే దేశానికి, రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని మంత్రి వేముల పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ మండల జడ్పీటిసి బిద్దం రవి, ఎంపిపి శివలింగు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు కల్లెడ ఏలియా, ఉపాధ్యక్షుడు సుభాష్, సుంకెట్ సర్పంచ్ కదారి శ్రీనివాస్, ఉప సర్పంచ్ పృథ్వీ, గ్రామ శాఖ అధ్యక్షుడు కె.పరమేష్, బీఆర్ఎస్ నాయకులు సందీప్, పిట్ల సత్యం, మాజి ఎంపిటిసి నవీన్, కదారి రవి, ఆరిఫ్, సుంకెట్ వార్డు సభ్యుడు ఓంకార్, సొసైటీ వైస్ చైర్మన్ చిరంజీవి, కే.చిన్న రాజన్న, తదితరులు పాల్గొన్నారు.




# ఆరెంజ్ హాస్పిటల్ డాక్టర్స్ టీంను సత్కరించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);డాక్టర్ డే రోజు పురస్కరించుకొని ఆరెంజ్ హాస్పిటల్ చైర్మన్ తో పాటు ఆరెంజ్ హాస్పిటల్ డాక్టర్స్ టీం ను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన కేకు ను కట్ చేసారు. అనంతరం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ హాస్పిటల్ డాక్టర్ ను సన్మానం చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ రోజు డాక్టర్ తన జీవితంలో సంతోషం ఎపుడు ఉంటుంది అంటే. తమ దగ్గరికి వచ్చిన ప్రతి పేషెంట్ చిరునవ్వుతో ఇంటికి తిరిగి వెళ్లినప్పుడు మాత్రమే మాకు సంతోషం అంటున్నారు. ఇంతటి నిష్ఠ కలిగిన ఆరెంజ్ హాస్పిటల్ డాక్టర్స్ టీం ను సత్కరించి నందుకు నాకూ చాలా సంతోషంగా ఉందని ప్రవీణ్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్, డాక్టర్ హరీ ప్రకాష్, డాక్టర్ క్రాంతి, మేడి పాపయ్య, ధర్మేందర్, సంద్రపల్లి వెంకటయ్య లను కూడా అభినందించారు.

# టీ-డయాగ్నోస్టిక్స్‌లో ఉచితంగా 134 వైద్య పరీక్షలు: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, జులై 1: ఆరోగ్య తెలంగాణ కోసం కృషిచేద్దామని మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల వైద్య సైవలు, పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. 70 శాతం ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరుగుతున్నా యని తెలిపారు. టీ-డయాగ్నోస్టిక్స్‌లో 134 వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్ కొండాపూర్ ప్రభుత్వ దవాఖాన నుంచి వర్చువల్‌గా 134 వైద్య పరీక్షలను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. టీ-డయాగ్నోస్టిక్స్ ద్వారా 134 పరీక్షలు ఉచితంగా చేస్తున్నామన్నారు.

అన్ని పీహెచ్‌సీల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం లేదని తెలిపారు.

రాష్ట్రంలోని 31 జిల్లాల్లో టీ-డయాగ్నోస్టిక్స్ కేంద్రాలు, రేడియాలజీ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయని మంత్రి అన్నారు. మరో రెండు జిల్లాల్లో పనులు జరుగుతున్నాయని, త్వరలోనే వాటిని కూడా పూర్తిచేస్తామన్నారు. కరోనా సమయంలో వైద్యులు ప్రాణాలకు తెగించి పనిచేశారని, ప్రజలను మహమ్మారిబారినుంచి రక్షించారని వెల్లడించారు. రాష్ట్రంలో వైద్యుల పనితీరు అద్భుతంగా ఉందన్నారు. వైద్యారోగ్య రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచేలా కృషిచేసిన డాక్టర్లందరికీ.. వరల్డ్ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

# పివి నరసింహారావు స్మారక ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం

హైదరాబాద్ జూలై 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో భారత పూర్వ ప్రధాని కీర్తిశేషులు పివి నరసింహారావు స్మారక ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం, కవి సమ్మేళనం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి విశ్రాంతి అధికారి డి చక్రపాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొల్కనూరు ఇనాక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పీవీ నరసింహారావు చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వల జరిగిన భావించారు.

ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ కపిల లక్ష్మణరావు, టీవీ స్వామి, జక్కుల వెంకటేష్ ,రెడ్డమ్మ, కళ్యాణ శ్రీ ఆలూరి విల్సన్, ఇందిర, కోదాటి అరుణకు పివి నరసింహారావు స్మారక పురస్కారాలు ప్రధాన చేసి సత్కరించారు.

అనంతరం అధ్యక్షులు డి చక్రపాణి మాట్లాడుతూ పీవీ నరసింహారావు తెలుగువారి ప్రతిభ మూర్తి అని కార్యదక్షుడని మౌనంగా ధైర్యంగా ఆత్మ ప్రబోధనతో నిర్ణయాలు తీసుకునే వారిని అన్నారు. ఆచార్య కొల్కనూర్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు స్మితప్రజ్ఞుడు, రచయితగా జాతి పునర్నిర్మాణం లో భాగస్వామ్య ఉత్తముడని అన్నారు.

ఆయన పేరిట అవార్డులు అందుకున్న వారిని అభినందించారు. ఇంకా ఈ సభలో దైవజ్ఞశర్మ, హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ, బండారుపల్లి రామచంద్రరావు, డాక్టర్ లలిత వాణి తదితరులు పాల్గొన్నారు.మానస సంస్థ వ్యవస్థాపకులు రఘు శ్రీ జన్మదిన సందర్భంగా 75 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా ఆత్మీయ అమృత్సవంగా సత్కరించారు సత్కరించారు

# ప్రభుత్వ అధునాతన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్,జులై 1:(నేటినిజం ప్రతినిధి): పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కల్పిస్తున్న అధునాతన వైద్య సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో 134 రకాల పాథాలజీ పరీక్షలను అప్‌గ్రేడ్ చేసే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్ నుంచి మంత్రి హరీశ్ రావు వర్చువల్ మోడ్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. 'వైద్యో నారాయణ హరి' అంటారని, అంటే వైద్యుడు ఆ దేవుడితో సమానమని అన్నారు . మనిషి ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో అవసరమైన వైద్యం అందించి పునర్జన్మను ప్రసాదించటంతో వైద్యులు హరితో సమానంగా భావిస్తారని తెలిపారు.

మహబూబాబాద్ జిల్లాలో రెండు కోట్లతో డయాగ్నోస్టిక్స్ సెంటర్ ను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు , వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు కోసం వెళితే ప్రైవేట్ ల్యాబ్ లకు రాసేవారని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పేద ప్రజలకు అధునాతన వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చిందని వెల్లడించారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా నర్సులకు హ్యాండ్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ , జిల్లా జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# జూన్ నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లు.. 12 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ, జులై 1: దేశీయంగా రోజురోజుకు జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్నాయి. 2022 జూన్ నెలతో పోలిస్తే గత నెలలో జీఎస్టీ వసూళ్లలో 12 శాతం వృద్ధిరేటు నమోదైంది. గత నెలలో రూ.1,61,497 కోట్ల స్థూల జీఎస్టీ వసూళ్లు జరిగాయని కేంద్ర ఆర్థికశాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

స్థూల జీఎస్టీ వసూళ్లలో సీజీఎస్టీ రూ.31,013 కోట్లు, ఎస్జీఎస్టీ రూ.38,292 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.80,292 కోట్లు (వస్తువుల దిగుమతిపై రూ.39,035 కోట్లతో పాటు), సెస్ రూ.11,900 కోట్లు (రూ.1,028 కోట్ల దిగుమతి సుంకంతోపాటు) వసూలయ్యాయి. ఐజీఎస్టీ నుంచి కేంద్రం రూ.36,224 కోట్లు సీజీఎస్టీ, ఎస్జీఎస్టీ కింద రూ.30,269 కోట్లు కేటాయించింది. జూన్ నెల జీఎస్టీలో కేంద్రానికి రూ.67,237 కోట్లు, రాష్ట్రాలకు రూ.68,561 కోట్లుగా సెటిల్ చేసినట్లు ఆర్థికశాఖ వెల్లడించింది.

సేవల దిగుమతి ద్వారా దేశీయ లావాదేవీల నుంచి 2022తో పోలిస్తే గత నెలలో 18 శాతం ఎక్కువ రెవెన్యూ లభించింది. వరుసగా నాలుగో నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లు దాటాయి. 2021-22 తొలి త్రైమాసికంలో సగటున రూ.1.10 లక్షల కోట్లు, 2022-23 తొలి త్రైమాసికంలో రూ.1.51 లక్షల కోట్లు, 2023-24 తొలి త్రైమాసికంలో రూ.1.69 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి.

# జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-4 పరీక్ష

## -పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, జులై 1:(నేటినిజం ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా గ్రూప్-4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

గ్రూప్ -4 పరీక్ష జిల్లాలో పరీక్ష రాసేందుకు అత్యధికంగా 14,011 మంది దరఖాస్తు చేసుకోగా ఉదయం పూట నిర్వహించిన పేపర్ కు 11,846 మంది, మధ్యాహ్నంనిర్వహించిన పేపర్ కు 11,803 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డి పేట, తంగల్లపల్లి, బోయినిపల్లి లలో 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 51 మంది చీఫ్ సూపరింటెండెంట్ లను, 50 మంది లైజన్ అఫీసర్లను, 614 మంది ఇన్విజిలేటర్లను, 13 రూట్ ల కోసం 26 మంది రూట్ అధికారులను నియమించారు.

### పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

గ్రూప్ -4 పరీక్ష జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరీక్షలు పారదర్శకంగా , ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

### పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ సిరిసిల్ల పట్టణంలోని చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గాయత్రి డిగ్రీ పీజీ కళాశాలలో, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రూప్ -4 పరీక్షల నిర్వహణ కు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగాయి.

# సీనియర్ నటుడు ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులకు అందించిన సేవలు చిరస్మరణీయం : మంత్రి జగదీష్ రెడ్డి



హైదరాబాద్, జులై 1:సీనియర్ నటుడు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సినీ పేద కార్మికులకు ఎంతగానో అండగా నిలిచారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా ఐదువేల మంది కార్మికులకు కాలనీ ఏర్పాటులో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. చిత్రపురి కాలనీలో దివంగత నటుడు ప్రభాకర్‌రెడ్డి విగ్రహాన్నిమంత్రి శనివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభాకర్ రెడ్డి జన జీవితంలో తన అవసరాల కంటే తనతో సినీ రంగంలో పనిచేస్తున్న పేద కార్మికుల అవసరమే ముఖ్యమని భావించారని వెల్లడించారు. అటువంటి మహానుబావుడు నల్లగొండ బిడ్డ అయినందుకు గర్వపడుతున్నానని అన్నారు. వృత్తి రీత్యా వైద్యుడు అయినప్పటికీ నాటక రంగం మీద ఉన్న మక్కువతో మద్రాస్ కు చేరుకుని 472 పై చిలుకు సినిమాలలో నటించారన్నారు.

హైదరాబాద్ కు సినీపరిశ్రమ తరలి వచ్చిన సందర్భంలో పరిశ్రమలు అంటే యజమానులు మాత్రమే కాదని,అందులో కార్మికులు కూడ ఉంటారని గుర్తు చేశారని తెలిపారు. డాక్టర్ల దినోత్సవం రోజున విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లోకసభ సభ్యులు డాక్టర్ రంజిత్ రెడ్డి,శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, దర్శకుడు శంకర్, సినీనటుడు నారాయణ మూర్తి , ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు నియామకాల్లో అక్రమాలపై సమాచారం ఇస్తే 3 లక్షల పారితోషికం

హైదరాబాద్, జులై 1:రాష్ట్రంలో పోలీసుల ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరుగుతోందని పోలీసు నియామక మండలి చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. అక్రమాల గురించి తెలిస్తే పోలీసు నియామక మండలికి దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. అక్రమాలపై పక్కా సమాచారం ఇచ్చిన వారికి రూ.3 లక్షల పారితోషికం ఇస్తామని తెలిపారు.

పోలీసు ఉద్యోగాల కోసం మొత్తం 12.9 లక్షల దరఖాస్తులు వచ్చాయని శ్రీనివాసరావు తెలిపారు. కొంతమంది అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు అప్లై చేశారని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగాల భర్తీకి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యిందని చెప్పారు. గత నెల 14 నుంచి 26వ తేదీ వరకు 97 వేల మందికి పైగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశామని వెల్లడించారు. మూడు దశల్లో ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టామని అన్నారు. తుది రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యిందని అన్నారు. వయసు, విద్యార్హత లేకున్నా కొంతమంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని.. వారి దరఖాస్తులు తిరస్కరించామని వెల్లడించారు

# ప్రతీ ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి:జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్



ఖమ్మం, జులై 1:: (నేటినిజం ప్రతినిధి): ప్రతీఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శనివారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యక్తిగత సహాయకులు బిట్టా ప్రవీణ్ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా క్షయ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చికిత్స పొందుతున్న వారి సౌకర్యార్థం(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీ క్రింద)సెంచరీ పరుపులను అందజేశారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... సేవచేయాలనే తలంపు చాలా ఉన్నతమైనదని, పేద రోగులకు 25 కార్పొరేట్ పరుపులను అందజేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ను కలెక్టర్ అభినందించారు.

చికిత్స పొందుతున్న రోగులకు ఆయన పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వరరావు, జిల్లా క్షయ నివారణాధికారి డా. వరికూటి సుబ్బారావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డా.బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ డా.శ్రీనివాసరావు, సిబ్బంది జయపాల్, శ్రీకాంత్, మేరీ, పే బ్యాక్ సొసైటీ ఫౌండర్ జంగం లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు

# తానే తల్లినై మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ సీఐ అంజలి

ఖమ్మం, జులై 1:: (నేటినిజం ప్రతినిధి): గ్రూప్-4 పరీక్షలు రాసేందుకు గార్ల నుండి తమ 6 నెలల చిన్నారితో ఖమ్మం నగరంలోని ఎస్బీఐటి కాలేజ్ కు చేరుకున్న గాంధీ-ఉషారాణి అనే దంపతులిద్దరూ పరీక్ష కేంద్రం వద్ద చిన్నారిని వారి తల్లిదండ్రులకు అప్పగించేందుకు ఎదురుచూస్తున్నారు. పరీక్ష కేంద్రానికి వస్తామన్న వారు బస్సు ఆలస్యం కావడంతో వారు సమయానికి చేరుకోలేదు. పరీక్ష సమయం కొద్ది నిమిషాలు వుండటం ఆందోళనకు గురవుతున్న దంపతులకు మేము ఉన్నంమంటూ..అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిఐ అంజలి చిన్నారిని తీసుకొని వారిని పరీక్ష కేంద్రంలోకి పంపించారు. చిన్నారి తాత-అమ్మమ్మ వచ్చే వరకు సిఐ అంజలి చిన్నారిని తనే అమ్మనై అలానవలనా చూసుకుంటూ మానవత్వాన్ని చాటారు. ఈ ఘటన చూసిన పలువురు సిఐ అంజలిని కృతజ్ఞతలతో అభినందించారు.

# ప్రశాంతంగా పూర్తయిన గ్రూప్ -4 పరీక్ష

**- పేపర్ -1 కు 27,962 మంది హాజరు**

**-పేపర్ ఎఎ- కు 27,826 మంది హాజరు**

**- గ్రూప్-4 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**

సంగారెడ్డి, జూలై 01 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా జిల్లాలో శనివారం ఉదయం, మధ్యాహ్నం రెండు స్టేషన్స్ లో జరిగిన గ్రూప్-4 పరీక్ష ప్రశాంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. జిల్లాలో గ్రూప్- 4 పరీక్షకు 33,452 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా, ఉదయం సెషన్లో(పేపర్- ఎ) కు 27,962 మంది హాజరయ్యారని, 5,490 మంది గైరాజరైనట్లు తెలిపారు. 83.59 శాతం హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం సెక్షన్ (పేపర్-ఎఎ ) కు 27,826 మంది హాజరు కాగా, 5626 మంది గైరాజరయ్యారని, హాజరు శాతం 83.18 శాతంగా నమోదైనట్లు తెలిపారు. ఉదయం సెషన్లో సంగారెడ్డి పట్టణం బైపాస్ రోడ్ లో గల రిషి హై స్కూల్ లో గల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరుతెన్నులను కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. పరీక్షా కేంద్రం లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించారు. మధ్యాహ్నం రెండవ సెషన్ లో జరిగే పేపర్-2 పరీక్షను పకడ్బందీగా



నిర్వహించాలని, టీ ఎస్ పీ ఎస్ సీ నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ విజయ్ కుమార్ ఉన్నారు.

# నగల దుకాణం చోరీ కేసులో.. మరో నలుగురు అరెస్ట్

హైదరాబాద్, జులై 1:ఐటీ అధికారులమంటూ సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లోని నగల దుకాణంలో బంగారు బిస్కెట్లు దోచుకెళ్లిన కేసులో పోలీసులు తాజాగా శుక్రవారం మరో నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.45లక్షల విలువజేసే 715గ్రాముల బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి గతంలో ఐదుగురు అరెస్టు చేశారు. శుక్రవారం ఉత్తర మండలం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ చందనా దీప్తి కేసు పూర్వాపరాలను వెల్లడించారు. నగరానికి చెందిన మహేందర్ బాబా సికింద్రాబాద్‌లోని పాట్ మార్కెట్‌లో సిద్ధివినాయక నగల దుకాణం పేరుతో బంగారు ఆభరణాలు తయారు చేసే వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాడు.

ఈ వర్క్‌షాప్‌లో బంగారు బిస్కెట్లతో పాటు పాత బంగారాన్ని కరగదీసి ఆభరణాలు తయారు చేస్తారు. కాగా, పాట్‌మార్కెట్‌లోని హర్షద్ గోల్డ్‌వెల్డింగ్ షాప్‌లో వర్కర్‌గా పనిలో చేరిన మహారాష్ట్ర, ఖానాపూర్ ప్రాంతానికి చెందిన జకీర్ ఘని అత్తర్ కస్టమర్ల నుంచి సేకరించిన బంగారాన్ని కరిగించి, నగల తయారీ కోసం సిద్ధివినాయక గోల్డ్ షాప్‌కు తీసుకువెళ్లేవాడు. ఈ క్రమంలో అక్కడ జరిగే కార్యకలాపాలు, బంగారు బిస్కెట్లను చూసిన జకీర్ ఈ విషయాన్ని తన స్నేహితులు, అనుచరులకు చేరవేశాడు. అంతే కాకుండా ఏదైనా చేసి ఈ బంగారాన్ని తస్కరించాలని పథకం పన్నాడు. తన పథకాన్ని తన స్నేహితులు, పాతనేరస్తులైన ఖానాపూర్‌లోని ఆరుగురికి, గోవాలో ఉన్న ముగ్గురికి వివరించాడు. బంగారాన్ని దోచుకునేందుకు ఐటీ అధికారుల అవతారమెత్తాలని నిర్ణయించుకున్నారు.

ఈ క్రమంలో ఐటీ అధికారులుగా నమ్మించేందుకు నకిలీ ఐడీ కార్డులు తయారు చేసుకుని మే 24న మహారాష్ట్ర ఖానాపూర్‌కు చెందిన రహ్మాన్ గఫూర్ అత్తర్, ప్రవీణ్‌యాదవ్, ఆకాశ్ అరుణ్ హవ్లీ, అభిజిత్ కుమార్ గోడ్కె, అమోల్ గన్‌పత్రావ్ జాదవ్ బస్సులో, గోవాకు చెందిన సిద్ధాంత్ అలియాస్ సిదార్థ్ జాదవ్, సంజయ్ పరశురామ్ జాదవ్, శుభం వినోద్ జాదవ్, అజయ్ వినోద్ జాదవ్ ట్రైన్‌లో నగరానికి చేరుకున్నారు. వీరంతా కలిసి నగరంలోని ఢిల్లీ లాడ్జిలో బస చేశారు. బంగారం దుకాణంలో పనిచేసే జాకీర్ ఘని అత్తర్ సైతం ఢిల్లీ లాడ్జికి వెళ్లి తన స్నేహితులతో దోపిడీకి సంబంధించిన పథకాన్ని వివరించాడు. ఇందులో భాగంగా బాబు, లాలా అనే ఇద్దరు వ్యక్తులను పాట్‌మార్కెట్‌కు తీసుకెళ్లి అక్కడున్న సిద్ధివినాయక బంగారం దుకాణాన్ని చూపించారు. పథకం ప్రకారం మే 27వ తేదీన ఉదయం 11.40గంటల సమయంలో నిందితులంతా కలిసి పాట్‌మార్కెట్‌లోని సిద్ధి వినాయక బంగారం దుకాణంలోకి వెళ్లి తాము ఐటీ అధికారులమంటూ నకిలీ గుర్తింపు కార్డులను చూపించి అక్కడున్న వర్కర్లను బెదిరించారు. వెంటనే వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు లాగేసుకుని వర్కర్లందరిని ఒక గదిలో బంధించారు. దుకాణంలో ఉన్న రూ. 60లక్షల విలువజేసే 17 బంగారు బిస్కెట్లను తీసుకుని ఉడాయించారు.నగల దుకాణం నిర్వాహకుడు వికాస్ కేదేకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మే 30న రెహ్మాన్ గఫూర్ అత్తర్, జాకీర్ ఘని అత్తర్, ప్రవీణ్ యాదవ్, ఆకాశ్ అరుణ్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 573 గ్రాముల బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జూన్ 15న మహారాష్ట్రకు చెందిన అభిజిత్ కుమార్‌ను అరెస్టు చేశారు. తాజాగా పరారీలో ఉన్న రుషికేష్ వినోద్ జాదవ్, శుభం వినోద్ జాదవ్, సంజయ్ పరశురామ్ జాదవ్, అముల్ గణపత్‌రావు జాదవ్‌ను శుక్రవారం అరెస్టు చేశారు.


ఆహ్వానము

జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
CULTURE IS LOVE OF HUMANITY
GVR CULTURAL FOUNDATION
ప్రపంచ రికార్డులు నెలకొల్పిన శ్రీత్యాగరాయ గానసభ



" కవిశేఖర " శ్రీ జన్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన
" వ్యాస మంజూష " గ్రంథావిష్కరణ - డా॥ హిప్నో పద్మాకమలాకర్ గారికి
అంకితోత్సవం మరియు జన్నాభట్ల నరసింహప్రసాద్ కథలు,
నవలికలు - పరిశీలన పై పరిశోధన గావించి డాక్టరేట్ పొందిన
డా॥ మట్టా హారిక, విజయవాడ అభినందన సత్కారం



ముఖ్య అతిథి :
పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్
ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి

గౌరవ అతిథి :
ప్రొ॥ ముదిగొండ శివప్రసాద్
చారిత్రక నవలా చక్రవర్తి

సభాధ్యక్షులు :
శ్రీ పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు, సాహితీ కిరణం

సభాప్రారంభం :
శ్రీ కళా వి.ఎస్.జనార్ధనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గాణసభ

అతిథుల సత్కారం :
శ్రీ బైస దేవదాసు
సంపాదకులు, నేటి నిజం

పుస్తక సమీక్ష :
శ్రీ పెద్దూరి వెంకటదాసు
కవి, రచయిత

జోతి ప్రకాశనం :
శ్రీమతి శేషభట్టార్ రజిత ఆచార్య
కూచిపూడి నాట్యగురువు

కృతి స్వీకర్త



డా॥ హిప్నో పద్మాకమలాకర్

స్పందన :
డా॥ హిప్నో పద్మాకమలాకర్
డా॥ మట్టా హారిక,
శ్రీ జనాభట్ల నరసింహప్రసాద్

అభినందన సత్కార స్వీకర్త



డా॥ మట్టా హారిక, విజయవాడ

సాంస్కృతిక కార్యక్రమం : సంగీత విభావరి
గానం : శ్రీ లక్ష్మీనరసింహ సంగీత కళాశాల ప్రిన్సిపాల్, సంగీత గురువు, నాగారం, శ్రీమతి జన్నా భట్ల లక్ష్మీకామేశ్వరి గారి శిష్యులు. మెరుగు విష్ణు భగవాన్, టి. ఆర్తిన్, టి. చరణ్, డి. దృపద్, కె. సత్యసాయిసుజయ్, కె. యశశ్విన్, గానవి, గొర్తి శ్రీధన్వి
కూచిపూడి నృత్యం: బేబి శేషభట్టార్ ఆరోహి శరణ్య

08-07-2023, శనివారం, కళాసుబ్బారావు కళావేధిక, చిక్కడపల్లి, హైదరాబాద్.

లయన్ గుదిబండి వెంకటరెడ్డి, చైర్మన్
లయన్ వి.వి. రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి , జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

శ్రీమతి కళా శారదా దీక్షితులు
ప్రధాన కార్యదర్శి, శ్రీత్యాగరాయ గాణసభ

